సాక్షి
అన్నమయ్య జిల్లా

శుక్రవారం । 20 । అక్టోబర్ । 2023




మృత్యువులోనూ వీడని అనుబంధం

అన్నమయ్య జిల్లా మదనపల్లెలో అనారోగ్యంతో తనముడు మృతి చెందడంతో.. తల్లడిల్లిన తల్లి ఆత్మహత్య చేసుకుంది. -IIలో



సీసీలు, సంఘమిత్రల చేతివాటం

బ్యాంకుకు జమ కావాల్సిన స్త్రీనిధి సొమ్ము పక్కదారి పట్టింది. నమ్మకంగా ఉండాల్సిన సీసీ, సంఘమిత్రలే సభ్యుల సొమ్మును దిగమింగేశారు. -IIలో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.110	రూ.150
రెండోరకం	రూ.66	రూ.98



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 298 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	485	485
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 166.040 కిలోలు

న్యూస్‌రీల్

31న జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశం

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశం ఈనెల 31వ తేదీ నిర్వహిస్తున్నామని జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 9.30 గంటలకు జెడ్పీ కార్యాలయంలో సమావేశాలు జరుగుతాయన్నారు. ఉమ్మడి జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల అధికారులు ఈ సమావేశానికి హాజరు కావాలని కోరారు.

21 వరకు బియ్యం సరఫరా

రాయచోటి: కార్డుదారులకు బియ్యం పంపిణీ కార్యక్రమం ఈనెల 21వ తేదీ వరకు జరుగుతుందని జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్డులోని ప్రతి వ్యక్తికి 5 కిలోల చొప్పున సార్టెక్స్ చేసిన నాణ్యమైన బియ్యం ఉచితంగా పంపిణీ చేస్తారన్నారు.ప్రతి బియ్యం కార్డుకు రాగులు ఒక కేజీ, నుంచి 3 కేజీల వరకు ఉచితంగా పొందొచ్చన్నారు. గోధుమ పిండి 1 కేజీ రూ. 16లు, చెక్కర తెల్ల కార్డుకు అరకేజీ రూ. 17లు, అంత్యోదయ కార్డుకు ఒక కిలో చెక్కర రూ. 13.50లు నగదు చెల్లించి పొందొచ్చని జాయింట్ కలెక్టర్ పేర్కొన్నారు.

పొలంబడి క్షేత్రాలతో అధిక ప్రయోజనం



ఆముదం పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి చంద్రనాయక్

కేవీపల్లి: పొలంబడి వ్యవసాయ క్షేత్రాలతో రైతులు అధిక ప్రయోజనం పొందొచ్చని జిల్లా వ్యవసాయాధికారి చంద్రనాయక్ అన్నారు. గురువారం మండలంలోని తువ్వపల్లెలో వేరుశెనగ పొలంబడి క్షేత్రాన్ని సందర్శించి పంట కోత ప్రయోగం చేపట్టారు. గ్యారంపల్లె వద్ద నిర్మాణంలో ఉన్న రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించారు. ఆముదం, ఉలవ పంటలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏడీఏ వై.వి. రమణరావు, ఏవో శ్రావణి, రైతులు పాల్గొన్నారు.

పదోన్నతులకు కౌన్సిలింగ్

కడప ఎడ్యుకేషన్: కడపలోని ఇంటర్మీడియట్ ఆర్‌జేడీ కార్యాలయంలో ఆర్జేడీ రవి ఆధ్వర్యంలో నాన్ టీచింగ్ సిబ్బంది పదోన్నతులకు నిర్వహించిన కౌన్సిలింగ్ ప్రశాంతంగా జరిగింది. రాయలసీమ ఉమ్మడి జిల్లాలకు సంబంధించిన కడప, కర్నూలు, చిత్తూరు, అనంతపురం జిల్లాలలో పనిచేసే 39మంది జూనియర్ అసిసెంట్లు, టైపిస్టులకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించారు. కర్నూలు జిల్లాలో 13 మందికి, కడపలో ముగ్గురికి, అనంతపురంలో ఎనిమిది మంది, చిత్తూరులో 13 మందికి పదోన్నతులు లభించాయి. ఆర్ఐవో రమణరాజు, డీవీఈఓ శ్రీనివాసులరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడలు ముఖ్యం

కడప ఎడ్యుకేషన్: పోటీ ప్రపంచంలో విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు ముఖ్యమేనని సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. గుంటూరు జిల్లా పేరిచర్ల జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఈ నెల 16, 17వ తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి టెన్నిస్‌బాల్ క్రికెట్, కబడ్డీ పోటీలలో సిద్దవటం జడ్పీ పాఠశాల విద్యార్థులు రాణించి జట్టును తృతీయ స్థానంలో నిలిపారు. వారిని పీడీ అంబవరం ప్రభాకర్‌రెడ్డి గురువారం అభినందించారు. ఆయన మాట్లాడుతూ క్రీడలతో సున్నితమైన మనస్తత్వాన్ని విడనాడి దృఢంగా తయారవుతారన్నారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించి జిల్లాకు పేరు ప్రతిష్ట తీసుకురావాలన్నారు. జీసీడీవో విజయలక్ష్మి, సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు చల్లా విశ్వనాథరెడ్డి, దశరథరామి రెడ్డి, రజనీకాంత్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి సుబ్బయ్య శ్రీ పాల్గొన్నారు.

25 నుంచి మచిలీపట్నం-ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రద్దు

కడప కోటిరెడ్డిసర్కిల్: మచిలీపట్నం-ధర్మవరం మధ్య నడుస్తున్న ఎక్స్‌ప్రెస్ రైలు (17215/16)ను ఈ నెల 25వ తేదీ నుంచి 30వ తేదీ వరకు రద్దు చేసినట్లు కడప రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. ఈ నెల 22వ తేదీ నుంచి 24వ తేదీ వరకు మచిలీపట్నం-ధర్మవరం ఎక్స్‌ప్రెస్‌ను బనగానపల్లె, కోయిలకుంట్ల, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, కొండాపురం, తాడిపత్రి, గుత్తి మీదుగా ధర్మవరానికి మళ్లించామన్నారు. నంద్యాల, డోన్, గుత్తి మీదుగా ధర్మవరానికి నడుపనున్నట్లు తెలిపారు. ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు ధర్మవరం-మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ రైలును దారి మళ్లించారన్నారు. దీంతోపాటు కడప-అరక్కోణం(06401/02) రైలును రద్దు చేశారన్నారు. రైల్వే పనులు జరుగుతున్న తరుణంలో ఈ నిర్ణయం తీసుకున్నారని ఆయన వివరించారు.

పుత్తడి బొమ్మకు అక్షరబంధం

రైల్వేకోడూరు నియోజకవర్గంలోని చిట్వేలికి చెందిన 17 సంవత్సరాల భారతి (పేరు మార్చాం) అనే బాలికకు సమీప ప్రాంతానికి చెందిన మైనర్ బాలుడితో వివాహం చేయాలని నిశ్చయించారు. చిట్వేలిలోని ఓ ఆలయంలో రాత్రికి రాత్రే వివాహ ఏర్పాట్లు చేశారు. ఈలోపే 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ నంబరుకు సమాచారం అందుకున్న ఐసీడీఎస్ సిబ్బంది పోలీసుల సహకారంతో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. చట్టప్రకారం ఇద్దరూ మైనర్లు కావడంతో ఈ వివాహం చెల్లుబాటు కాదని ఇరువర్గాలను ఒప్పించి కౌన్సెలింగ్ ద్వారా ఇంటికి పంపించారు. పదో తరగతి పాసై ఇంటి వద్దనే ఉన్న బాలికను ఐసీడీఎస్ సీడీపీఓలు రాజేశ్వరి, సౌభాగ్యలు తల్లిదండ్రులను ఒప్పించి ఇంటర్మీడియేట్ చదివేలా చర్యలు తీసుకున్నారు.

రైల్వేకోడూరు మండల పరిధిలోని చియ్యవరం గ్రామానికి చెందిన ఒక బాలుడికి ఓబులవారిపల్లె మండలం చిన్నంపల్లెకు చెందిన ఓ బాలికతో స్థానిక రైల్వేకోడూరులోగల వేణుగోపాలస్వామి ఆలయంలో వివాహం చేయాలని పెద్దలు నిర్ణయించారు. 17 సంవత్సరాలే ఉండడంతో బాలికకు వివాహం చేయడానికి అవకాశం లేదని ఐసీడీఎస్ సిబ్బంది నేరుగా ఇద్దరు పెద్దలతో చర్చించారు. ఎట్టకేలకు వివాహాన్ని నిలిపివేశారు. అనంతరం బాలికను చదివించాలని తలిదండ్రులకు హితబోధ చేయడంతో ప్రస్తుతం ఆ బాలిక డిగ్రీస్థాయిలో విద్యను అభ్యసిస్తోంది.

రైల్వేకోడూరు పట్టణంలో లక్ష్మి అనే బాలిక (15 సంవత్సరాలు) పదవ తరగతి చదువుతోంది. అయితే బాలిక వయస్సు కన్నా 12 ఏళ్ల అధిక వయస్సు గల వ్యక్తితో సమీపంలోని కోనలో వివాహం చేయాలని సంకల్పించారు. అయితే వివాహం ఇష్టం లేని బాలిక తరపు వారు సమాచారాన్ని సంబంధిత అధికారులకు అందించడంతో పోలీసుల సహకారంతో బాల్య వివాహాన్ని అడ్డుకున్నారు.



రైల్వేకోడూరు పరిధిలో కౌన్సెలింగ్ ఇస్తున్న అధికారులు

- బాలికా వికాసంతోనే బాల్య వివాహాల నిర్మూలన
- టెన్త్ తర్వాత ఇంటర్, డిగ్రీ వైపు ప్రోత్సాహం
- ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన

సాక్షి రాయచోటి: పుస్తకాలు పట్టుకునే వయస్సులో బాలికల మెడలో పుస్తెల తాళ్లు కట్టుగొయ్యలవుతున్నాయి. చిన్న వయస్సులోనే పెళ్లిళ్లు చేసి వారి భవిష్యత్తును అంధకారం చేస్తున్నారు. పేదరికం..నిరక్షరాస్యత..బాధ్యతల నుంచి తప్పుకోవడమే లక్ష్యంగా కొందరు వేసే తప్పటడుగులు బాలికల పట్ల శాపాలుగా మారుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం బాల్య వివాహాల నిర్మూలనకు నడుం బిగించింది. ఉన్నత చదువులు చదివించడం ద్వారా మాత్రమే బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయవచ్చని, ఆ దిశగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పీఎస్ గిరీషా సంబంధిత అధికారులను ఆదేశిస్తున్నారు.తల్లిదండ్రులకు చదువు లేకపోవడం...చదువుకునే అవకాశాలు అందుబాటులో లేకపోవడం...చదవాలనుకున్నా పాఠశాలలు, కళాశాలలు దూరంగా ఉండడం లాంటి సమస్యలతోపాటు పేదరికంతో బాల్య వివాహాలవైపు అడుగులు వేస్తున్నారు. సాధారణంగా అమ్మాయికి 18, అబ్బాయికి 21 సంవత్సరాలు నిండే వరకు వివాహం చేయకూడదన్న నిబంధనలను విస్మరించడాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. అసలు బాల్య వివాహాలు ఎందుకు జరుగుతున్నాయి? జరిగే చోట బాలికల పరిస్థితి ఎలా ఉంది? వీటిని ఎలా నిర్మూలించాలి? వాటి భవిష్యత్తుకు బాటలు ఎలా వేయాలన్న అంశాలపై స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులు అన్నిచోట్ల విస్తృత అవగాహన కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు సంబంధించిన సమాచారం

సంవత్సరం	అడ్డుకున్న బాల్య వివాహాలు
2015	11
2016	21
2017	23
2018	51
2019	28
2020	52
2021	13
2022	41
2023	137



పేదరికం, నిరక్షరాస్యతే ప్రధాన కారణం

అన్నమయ్య జిల్లాలోని రైల్వేకోడూరు, చిట్వేలి, రాజంపేట, సుండుపల్లె, లక్కిరెడ్డిపల్లె, రాయచోటి తదితర ప్రాంతాల నుంచి జీవనోపాధి నిమిత్తం అత్యధికంగా ఇతర దేశాలకు వెళ్లారు. ప్రధానంగా కువైట్, ఖత్తర్, దుబాయ్, సౌదీ అరేబియాలకు పనుల నిమిత్తం ఇక్క డి నుంచి వేల సంఖ్యలో వెళ్లారు. ఒకవైపు పేదరికం, మరోవైపు గ్రామీణ ప్రాంతాల్లో అక్షరజ్ఞానం లేని వారు బాల్య వివాహాల వైపు అడుగులు వేస్తున్నారు. ఇప్పుడిప్పుడే ప్రజలు మేలుకొంటున్న తరుణంలో ఎక్కడైనా బాల్య వివాహం జరుగుతున్నా వెంటనే అధికారులకు తెలియజేయాల్సిన బాధ్యత అందరిపై ఉంది.

సమాచారం అందించాల్సిన టోల్ ఫ్రీ నెంబర్లు

చైల్డ్ లైన్: 1098
ఉమెన్ హెల్ప్‌లైన్ నెంబరు : 181
వన్ ఇండియా-వన్ ఎమెర్జెన్సీనెంబరు : 112

అవగాహన కార్యక్రమాలు

అన్నమయ్య జిల్లాలో ఎక్కడికక్కడ బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. కల్యాణ మండపాల్లోనూ, దేవాలయాల వద్ద బ్యాండుమేళాల వారికి, పురోహితులు, పాస్టర్లు, ఖాజీలు, స్వయం సహాయక సంఘాలు, వీడియో కెమెరామెన్, ఫొటోగ్రాఫర్లు ఇలా అందరిలోనూ బాల్య వివాహాలు చేయకూడదన్న వివరాలను తెలియజేస్తున్నారు. ఆలయాలు, కల్యాణ మండపాలు, కమ్యూనిటీ భవనాల్లో ప్రత్యేకంగా బాల్య వివాహాలు నేరమంటూ ప్రత్యేకంగా బోర్డులను కూడా ఏర్పాటు చేశారు. జిల్లాలో బాల్య వివాహాల నిరోధానికి బాలికా విద్యను ప్రోత్సహించేందుకు కలెక్టర్ పీఎస్ గిరీషా చర్యలు చేపట్టారు. ఇటీవలే పాఠశాలలకు వెళ్లకుండా పనులు చేస్తున్న దాదాపు 150 మందికి పైగా చిన్నారులను గుర్తించి వారిని బడిలో చేర్పించారు.

అవగాహన కల్పిస్తున్నాం



బాల్య వివాహాల నిరోధానికి అంగన్వాడీ సిబ్బంది మొదలుకొని స్త్రీ శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్నాం. నిర్ణీత వయస్సు వచ్చే వరకు వివాహం చేయకూడదని తెలియజేస్తున్నాం. బాల్య వివాహాల పట్ల ఎప్పటికప్పుడు గ్రామీణుల్లో చైతన్యం తీసుకు వస్తున్నాం. అందుకోసం సుమారు 6500 ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశాం. - ధనలక్ష్మి, జిల్లా స్త్రీ శిశు సంక్షేమశాఖ అధికారి

బాలికా విద్యకు పెద్దపీట వేయాలి



బాల్య వివాహాలను నిరోధించడం కోసం ప్రభుత్వం తాజాగా జీఓ నంబరు 31, 39లలో మార్గదర్శకాలను విడుదల చేసింది. బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరం. ప్రతినెల బాల్య వివాహాలపై రివ్యూ జరుగుతుంది. సచివాలయ మహిళా పోలీసులు, పరిపాలన కార్యదర్శులు, మండల స్థాయిలో ఎంపీడీఓలు, ఎంఈఓలు బాల్య వివాహాలు జరగకుండా చూడాలి.బాలికా విద్యకు పెద్దపీట వేయాలి. -గిరీషా, జిల్లా కలెక్టర్

బాల్య వివాహం చట్టరీత్యా నేరం



జిల్లాలో ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలి. బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరం. అధికారులతోపాటు ప్రజలు కూడా బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి. - బి.కృష్ణారావు, జిల్లా ఎస్పీ, రాయచోటి, అన్నమయ్య జిల్లా

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



మాట్లాడుతున్న ప్రకృతి వనం ప్రసాద్

కురబలకోట: గడచిన 30 ఏళ్లుగా ప్రజల ఆరోగ్యపరిస్థితుల్లో మార్పులు వచ్చాయని, అంతకుముందు రోగాలు పెద్దగా ఉండేవి కాదని మదనపల్లె ప్రకృతి వనం ప్రసాద్ అన్నారు. అంగళ్లు మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో కేరీర్, పర్సనాలిటీ డెవలప్మెంట్‌పై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరైన పోషక విలువలు కలిగిన ఆహారం తినడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం పొందొచ్చన్నారు. ఆరోగ్య విషయాలపై అవగాహన ఉంటే మీకు మీరే డాక్టర్ కావచ్చన్నారు.ఎంత చదివినా ఎంతటి స్థాయిలో ఉన్నా ఆరోగ్యం సరిగ్గా లేకపోతే రాణించలేరన్నారు. చిరుధాన్యాల్లో పోషక విలువలు ఉన్నాయన్నారు. ఫైబర్ వల్ల నిదానంగా జీర్ణక్రియ జరుగుతుందన్నారు. విద్యార్థులు కేరీర్‌తో పాటు ఆరోగ్యం ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఏది తినాలో ఏది తినకూడదో ఎంత తినాలో నిర్ణయించుకుని నోటిని అదుపులో ఉంచుకుంటే 95 శాతం రోగాలను దూరం చేసుకోవచ్చన్నారు.

ఉజ్వల పథకం కింద గ్యాస్ కనెక్షన్

రాయచోటి: ఉజ్వల పథకం కింద ఏ విధమైన గ్యాస్ కనెక్షన్ లేని పేద ప్రజలకు ఉచితంగా గ్యాస్ కనెక్షన్ ఇస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తెలిపారు. గురువారం కలెక్టర్ సభా భవనంలో జిల్లా ఉజ్వల కమిటీతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ కనెక్షన్‌తోపాటు గ్యాస్ స్టవ్ కూడా ఉచితంగా ఇస్తారన్నారు. అర్హులైన వారు బీపీఎల్ సర్టిఫికెట్, కుల ధ్రువపత్రం, ఆధార్, రేషన్ కార్డు, బ్యాంక్ అకౌంట్ సంబంధిత పత్రాలను సమీపంలోని ఎల్‌పీజీ సరఫరాదారుల వద్ద లేదా ఆన్‌లైన్‌లో డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.పీఎంయూవై. జీఓవీ.ఇన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలియపరిచారు.

షూటింగ్ బాల్ విజేతలుగా నెల్లూరు, చిత్తూరు



విజేత జట్టుకు బహుమతి అందజేస్తున్న జెడ్పీటీసీ శృతి

కేవీపల్లి: అన్నమయ్య జిల్లా కేవీపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో రెండు రోజుల పాటు రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ షూటింగ్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ఇందులో 18 బాలుర, 16 బాలికల జట్లు పోటీ పడ్డాయి. గురువారం జరిగిన ఫైనల్లో బాలుర విభాగంలో నెల్లూరు. బాలికల విభాగంలో చిత్తూరు జట్లు విజేతలుగా నిలిచాయి. అన్నమయ్య జిల్లా తృతీయ స్థానం సాధించింది. బాలికల విభాగంలో నెల్లూరు ద్వితీయ, పల్నాడు తృతీయ స్థానం సాధించాయి. విజేతలకు జెడ్పీటీసీ గజ్జెల శృతి బహుమతులు ప్రదానం చేసి అభినందించారు. కార్యక్రమంలో పీలేరు లయన్స్‌క్లబ్ ప్లాటినం అధ్యక్షుడు సురేంద్ర, రాష్ట్ర షూటింగ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి పరుశురాముడు, జిల్లా కార్యదర్శి గౌతమి, ఉమ్మడి చిత్తూరు జిల్లా కన్వీనర్ నరేష్‌బాబు, హెచ్ఎం వై.వి. రమణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి నాగనారజ్ తదితరులు పాల్గొన్నారు.

పార్వతీదేవిగా జగజ్జనని



పార్వతీదేవి అలంకారంలో కన్యకాంబ

శరన్నవరాత్రి ఉత్సవాల్లో నాలుగో రోజున గురువారం అమ్మవారు బిల్వవృక్ష వాసిని పార్వతీ దేవిగా భక్తులను కటాక్షించారు. ప్రొద్దుటూరు వాసవీ కన్యకాపరమేశ్వరిదేవీ ఆలయంలో ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. సాయంత్రం శ్రీదేవి వనవిహారినిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. రాత్రి బిల్వవృక్ష వాసిని పార్వతీదేవిగా అమ్మవారిని ఇరువైపులా శివలింగాల ప్రతిమలతో ఆకట్టుకునేలా అలంకరించారు. ఆలయ ప్రాంగణాన్ని పచ్చని మొక్కలతో సుందరంగా తీర్చిదిద్దడంతో భక్తులు తిలకించి పులకించిపోయారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

వృత్తి వ్యాపారులకు జగనన్న చేదోడు

- జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్
- 2,641 మంది ఖాతాల్లో రూ.12,64,10,000 జమ



లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేస్తున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ తదితరులు

రాయచోటి : జగనన్న చేదోడు పథకాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకొని ఆర్థిక ప్రగతిని సాధించాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ పేర్కొన్నారు. గురువారం కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు నుంచి 'జగనన్న చేదోడు పథకం' నాలుగో ఏడాది మొత్తాన్ని లబ్ధిదారుల ఖాతాల్లోకి జమచేసే బృహత్తర కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. అన్నమయ్య జిల్లా రాయచోటి కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, మార్కెట్‌యార్డు కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి సందప్ప, సహాయ వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి కృష్ణయ్య, వివిధ శాఖల అధికారులు, టైలర్లు, రజకులు, నాయీ బ్రాహ్మణులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దారిద్ర్యరేఖకు దిగువున ఉన్న వెనుకబడిన వర్గాలు ఆర్థికంగా ఎదగడానికి, షాపులున్న రజక, నాయీ బ్రాహ్మణులు, టైలర్లకు ఏడాదికి రూ.10 వేలు ఆర్థికసహాయం అందజేస్తోందన్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వారికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ డబ్బు ఇతర అవసరాలకు కాకుండా తమ ఆదాయ వనరులను పెంచుకోవడానికి ఉపయోగించుకోవాలని సూచించారు. జిల్లాలో సంక్షేమ పథకాలు అందని వారు ఉంటే వెంటనే సమీపంలోని సచివాలయాలలో దరఖాస్తులు సమర్పించాలన్నారు. అనంతరం జగనన్న చేదోడు పథకానికి సంబంధించి వరుసగా నాలుగో ఏడాది జిల్లాలోని 12,641 మందికి రూ.12,64,10,000 సంబంధించిన మెగాచెక్కును జిల్లా కలెక్టర్, జేసీ చేతుల మీదుగా లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేశారు.

ముఖ్యమంత్రికి ధన్యవాదాలు



టైలర్ షాపు నడుపుతున్నాను. గతంలో ఎన్నడూ లేని విధంగా సీఎం జగన్ వివిధ సంక్షేమ పథకాలు అమలు చేస్తూ పేదల తలరాతలు మారుస్తున్నారన్నారు. జగనన్న ఇచ్చిన డబ్బులతో నా షాప్‌కు సంబంధించి కరెంట్ బిల్లు, టైలరింగ్ మెటీరియల్ కొనుగోలు చేస్తాను. నేడు ఇంటింటికీ పాలన అందిస్తూ గ్రామ స్వరాజ్యాన్ని ప్రత్యక్షంగా చూపిస్తున్న సీఎం జగన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు. - ఎస్.లత, టైలర్, రాయచోటి,

జీవితాంతం రుణపడి ఉంటాం



ల్యాండ్రీ షాపు పెట్టుకొని జీవనం కొనసాగిస్తున్నాను. సీఎం జగన్ మాలాంటి పేదవారి కష్టాలను చూసి జగనన్న చేదోడు పథకం ద్వారా ఏడాదికి రూ.10 వేలు చొప్పున ఆర్థిక సహాయం అందించడం శుభపరిణాం. నేను డబ్బుతో కరెంటు బిల్లులు కట్టుకొని, కుటుంబ అవసరాలకు ఉపయోగించుకుంటున్నాను. ఏటా అందించే డబ్బు ఎంతగానో ఉపయోగపడుతుంది. జీవితాంతం ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాను. - అశోక్‌కుమార్, లాండ్రీ షాప్, కె.రామాపురం

గతంలో లేని విధంగా సంక్షేమ పథకాలు



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్పయాత్రలో మా కష్టాలను స్వయంగా చూశారు. విన్నారు. పేదలు, వృత్తిదారులు, అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు.జగనన్న చేదోడు పథకం కింద రూ.10 వేలు ఆర్థికసాయం అందింది. ఆ డబ్బులతో షాపురకు కావాల్సిన మెటీరియల్‌ను కొనుగోలు చేస్తున్నాను. మమ్మల్ని ఎవరూ కూడా పట్టించుకోని పరిస్థితిలో జగనన్న ఆర్థిక సహాయం అందజేయడం మరువలేనిది. గతంలో ఎప్పుడూ లేని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు. ముఖ్యమంత్రికి జీవితాంతం రుణపడి ఉంటాం. - జి.వెంకటరమణ, హెయిర్ స్టైల్ కటింగ్ షాప్, కె.రామాపురం

జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా శ్రీలేఖ

రాయచోటి: అన్నమయ్య జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా శ్రీలేఖను నియమిస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.శ్రీలేఖ రెండు, మూడు రోజులలో బాధ్యతలు తీసుకుంటారని కలెక్టర్ ఏఓ తెలియజేశారు.

'సురక్ష'తో ఆరోగ్యకర సమాజం



వృద్ధులకు కళ్ల జోళ్లు అందిస్తున్న జిల్లా కలెక్టర్ గిరీషా

రాయచోటిటౌన్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్షతో... ఆరోగ్యకర సమాజం ఏర్పడుతుందని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అన్నారు. గురువారం రాయచోటి రూరల్ పరిధిలోని చెన్నముక్కపల్లెలో గ్రామ సర్పంచ్ రాయవరం మమత ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి కలెక్టర్ విచ్చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏపీఐఐసీ డైరెక్టర్ రాయవరం శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా అన్ని వర్గాల వారికి సీఎం జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. సర్పంచ్ మమత మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. చివరిలో వైద్య శిబిరంలో అనంతరం ప్రజలకు కంటి వెలుగు పథకం ద్వారా కళ్లద్దాలను జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు.

మృత్యువులోనూ వీడని అనుబంధం

వారు ఎంతో అన్యోన్యంగా జీవించారు. ఒకరంటే మరొకరికి ప్రాణం. మృత్యువులోనూ వారి జీవిత అను'బంధం' కొనసాగింది. హృదయ విదారకమైన ఈ సంఘటనలు ఒకే రోజు రెండు చోటుచేసుకున్నాయి. వైఎస్ఆర్ జిల్లా మైదుకూరు మండలం గంజికుంట గ్రామంలో అన్నను కడసారి చూసేందుకు వస్తున్న తమ్ముడు.. రోడ్డు ప్రమాదానికి గురై తిరిగిరాని లోకాలకు వెళ్లాడు. అన్నమయ్య జిల్లా మదనపల్లెలో అనారోగ్యంతో తనయుడు మృతి చెందడంతో.. తల్లడిల్లిన తల్లి ఆత్మహత్య చేసుకుని తనువు చాలించింది. ఈ ఘటనలతో ఆయా ప్రాంతాల్లో తీవ్ర విషాదం నెలకొంది.

అన్న వెంటే తమ్ముడు..

- విద్యుదాఘాతంతో అన్న మృతి
- కడసారి చూసేందుకు వస్తూ తమ్ముడు దుర్మరణం
- తల్లిదండ్రులకు తీరని శోకం

మైదుకూరు : ఒకే తల్లి కడుపున పుట్టిన రక్తసంబంధం వారిది. అన్న కంటే నాలుగేళ్ల తర్వాత తమ్ముడు జన్మించినా.. వయసులో తేడాలే తప్ప విడదీయలేని అనుబంధం వారిది. వారి అన్యోన్యతను చూసి విధికి కన్ను కుట్టిందేమో.. తమ్ముడి మరణ వార్త విని కడసారి చూసేందుకు వస్తున్న అన్ననూ మృత్యువు కబళించింది. పెళ్లీడుకొచ్చిన కొడుకుల ఆచ్చట ముచ్చట తీర్చక ముందే.. తిరిగిరాని లోకాలకు వెళ్లడంతో తల్లిదండ్రులు దుఃఖసాగరంలో మునిగిపోయారు. విషాదకరమైన ఈ సంఘటన గురువారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మైదుకూరు మండలంలోని గంజికుంటకు చెందిన పాములేటి రాజా, నాగలక్ష్మి దంపతులకు ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు. కుమార్తెకు వివాహం కాగా, పెద్ద కుమారుడు నరేంద్ర కుమార్ (29) కులవృత్తితోపాటు వ్యవసాయం చేసుకుంటూ ఇంటి వద్దే ఉన్నాడు. డిగ్రీ చదువుకున్న రెండవ కుమారుడు రాజేష్ కుమార్ (25) హైదరాబాద్‌లో ఓ ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్నాడు. గురువారం ఉదయం రాజా, పెద్ద కుమారుడు నరేంద్ర పొలం వద్దకు వెళ్లారు. సాగు చేసిన మినుము పంటకు నీరు కట్టేందుకు నరేంద్ర మోటార్ స్టార్టర్ బటన్ ఆన్ చేయగా.. విద్యుదాఘాతానికి గురయ్యాడు. తీవ్ర గాయాలపాలైన అతన్ని చికిత్స కోసం ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. నరేంద్ర మృతి చెందిన విషయాన్ని హైదరాబాద్‌లో ఉంటున్న అతని తమ్ముడు రాజేష్ కుమార్‌కు తెలిపారు. హైదరాబాద్ నుంచి రాజేష్ బైక్‌పై బయల్దేరాడు. షాద్‌నగర్ వద్ద అదుపు తప్పి బైక్‌పై నుంచి రోడ్డుపై పడటంతో తలకు తీవ్ర రక్తగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కడుపున పుట్టిన బిడ్డలు ఇద్దరూ ఒకే రోజు మృత్యువాత పడటంతో ఆ తల్లిదండ్రుల దుఃఖం కట్టలు తెంచుకుంది. గంజికుంట గ్రామస్తులు దిగ్భ్రాంతికి గురయ్యారు. గ్రామంలో విషాదం నెలకొంది. మైదుకూరు అర్బన్ ఏఎస్ఐ చంద్రమౌళి కేసు నమోదు చేసుకుని నరేంద్ర కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. షాద్‌నగర్ వద్ద జరిగిన సంఘటనలో మృతి చెందిన రాజేష్ కుమార్ మృతదేహానికి హైదరాబాద్‌లో ఉన్న రాజా బంధువులు పోస్టుమార్టం చేయించారు.



మృతి చెందిన నరేంద్ర కుమార్, రాజేష్ కుమార్


నరేంద్ర కుమార్ (ఫైల్)


రాజేష్‌కుమార్ (ఫైల్)

తనయుడి మృతితో 'తల్లి'డిల్లి..

మదనపల్లె : తనయుడి మృతితో తల్లి తనువు చాలించిన ఘటన గురువారం మదనపల్లె పట్టణంలో జరిగింది. నీరుగట్టువారిపల్లె రామిరెడ్డిలేఔట్ వరసిద్ధి వినాయకస్వామి గుడి వద్ద నివాసం ఉంటున్న రమణయ్య భార్య కె.లక్ష్మీదేవి(60)కి పదేళ్ల క్రితం భర్త చనిపోయాడు. ముగ్గురు కుమారులు. పెద్దకొడుకు ఆరు నెలల వయసులో చనిపోగా, రెండో కుమారుడు వెంకటరమణ పదమూడేళ్ల వయసులో అనారోగ్యంతో మృతి చెందాడు. చివరివాడైన నాగభూషణం(38)తో కలిసి తల్లి ఉంటోంది. నాగభూషణం చేనేత కార్మికుడు కాగా, అతడికి భార్య కుమారి, ఇద్దరు సంతానం ఉన్నారు. ఏడాది కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న నాగభూషణం ఆరునెలల క్రితం బెంగళూరు సెయింట్‌జాన్స్ ఆస్పత్రిలో ఆపరేషన్ చేయించుకున్నాడు. అనంతరం ఇంటివద్దే ఉంటున్నాడు. ఈక్రమంలో మూడురోజుల క్రితం నాగభూషణంకు విషజ్వరం తీవ్రమై పరిస్థితి విషమించింది. బుధవారం బెంగళూరు ఆస్పత్రిలో చేరి గురువారం మధ్యాహ్నం మృతి చెందాడు. కడుపున పుట్టిన ముగ్గురు బిడ్డల్లో.. చివరి వాడైనా మిగిలాడనుకున్న తల్లి లక్ష్మీదేవి, అతడు చనిపోయాడన్న విషయం తెలుసుకుని తీవ్ర మనోవేదనతో తల్లడిల్లింది. బిడ్డ లేని బతుకు తనకు ఎందుకంటూ కొడుకు చనిపోయిన గంటల వ్యవధిలోనే.. సాయంత్రం 4 గంటలకు తన ఇంటి బాత్‌రూమ్‌లో యాసిడ్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఐసీయూలో చికిత్సలు పొందుతూ సాయంత్రం 6.30 గంటలకు మృతి చెందింది. ఒకే కుటుంబంలో తల్లి, కొడుకు గంటల వ్యవధిలో చనిపోవడంపై విషాదం నెలకొంది. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తల్లి లక్ష్మీదేవి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.


మృతి చెందిన లక్ష్మీదేవి


నాగభూషణం(ఫైల్)

క్లుప్తంగా

రెండు ఆటోలు సీజ్

రామాపురం : మండల పరిధి దర్గా రోడ్డు సమీపంలోని జాతీయ రహదారిలో గల ఫారెస్టు చెక్ పోస్టు వద్ద గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. అధిక లోడుతో వెళ్తున్న రెండు ఆటోలను సీజ్ చేసి, ఆటో డ్రైవర్లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. వాహనదారులు జాతీయ రహదారిపై అధిక లోడుతో వెళ్లరాదని, ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని పేర్కొన్నారు. తనిఖీల్లో ఎస్ఐ శ్రీనివాస్ శర్మ, హెడ్‌కానిస్టేబుల్ రఫీ, పోలీస్ సిబ్బంది హరిప్రసాద్, శివప్రసాద్, అబ్దుల్‌కలాం తదితరులు పాల్గొన్నారు.

ఒకరిపై కేసు నమోదు

పెద్దమండ్యం : మండలంలోని బండమీదపల్లె పంచాయతీ తురకపల్లెలో నాటుబాంబు ఘటనలో గురువారం ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ ఇషాక్ తెలిపారు. తురకపల్లెలో నాటు బాంబు ఘటనలో కుక్క తల ఛిద్రమైన విషయం తెలిసిందే. ఘటనపై ఏఎస్ఐ సిబ్బందితో వెళ్లి తురకపల్లెలో విచారణ నిర్వహించారు. తురకపల్లెకు చెందిన చంద్రశేఖర నాయుడు పసలబండ వద్ద అడవి పందులను వేటాడేందుకు నాటుబాంబులను తయారు చేసేవాడని వెల్లడైనట్లు ఏఎస్ఐ తెలిపారు. నాటుబాంబులను తయారు చేస్తుండగా ఒక నాటుబాంబును నోటితో తీసుకుని కుక్క సమీపంలోని కాలనీ వద్దకు వెళ్లగా పేలడంతో తల ఛిద్రమైనట్లు తెలిపారు. కాగా మృతి చెందిన కుక్కకు వెటర్నరీ డాక్టర్ విక్రమ్‌రెడ్డి పోస్టుమార్టం నిర్వహించారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు మహిళలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి స్థానిక జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పట్టణంలోని అమ్మచెరువుమిట్ట శ్రీవారికాలనీకి చెందిన బావాజాన్ భార్య టీ.సల్మా(26) పిల్లలు అతిగా అల్లరి చేస్తుండగా.. ఎంతగా వారించినా వినకపోవడంతో మనస్తాపం చెంది పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యాయత్నంకు పాల్పడింది. అదే విధంగా చౌడేపల్లె మండలం పుదిపట్ల గ్రామానికి చెందిన విశ్వనాథ్ భార్య టీ.రమాదేవి(30) కుటుంబ సమస్యల కారణంగా ఇంటి వద్దే ఎలుకల నివారణ మందు తిని ఆత్మహత్యాయత్నంకు పాల్పడింది. సంబంధింత పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురికి గాయాలు

మదనపల్లె : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు వ్యక్తులు గాయపడి జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పీటీఎం మండలం మద్దయ్యగారిపల్లెకు చెందిన బి.చిరంజీవి(45) తన కుమారుడు బి.వినోద్(15), శివసాయి (12)లతో కలిసి ద్విచక్రవాహనంలో వస్తుండగా.. పీటీఎం సమీపంలో మరో ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడగా స్థానికులు 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. అదే విధంగా బీరంగి గ్రామానికి చెందిన వెంకటరమణ కుమారుడు నాగరాజు(38) మదనపల్లె పట్టణంలోని గొల్లపల్లిరోడ్డు ఎస్‌బీఐ కాలనీ రోడ్డు వద్ద వెళుతుండగా గుర్తు తెలియని ద్విచక్రవాహనం ఢీకొంది. వాహనం ఆపకుండా వెళ్లిపోయారు. ఈ ప్రమాదంలో నాగరాజు గాయపడగా, స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అదే విధంగా బి.కొత్తకోట మండలం మెటుకు పంచాయతీ ఇరువారిపల్లెకు చెందిన రామకృష్ణ కుమారుడు జి.సుదర్శన్(45) ద్విచక్రవాహనంలో ముద్దుమడుగు నుంచి ఇరుగువారిపల్లెకు వస్తూ మార్గమధ్యలో బద్దేపల్లి వద్ద మరో ద్విచక్రవాహనాన్ని తప్పించబోయి అదుపు తప్పి పడిపోయాడు. ప్రమాదంలో గాయపడిన సుదర్శన్‌ను కుటుంబ సభ్యులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు ప్రమాద ఘటనలపై విచారణ చేస్తున్నారు.


గాయపడిన చిరంజీవి

కారు, బైక్ ఢీకొని..

సంబేపల్లె : మండల పరిధిలోని రేగడికుంటకాడపల్లి సమీపంలో చిత్తూరు–కర్నూలు జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మహమ్మద్ రఫీ అనే వ్యక్తికి గాయాలయ్యాయి. మండలంలోని రెడ్డివారిపల్లి పంచాయతీ గానుపల్లికి చెందిన మహమ్మద్ రఫీ (25) అనే యువకుడు ద్విచక్ర వాహనంలో రాయచోటికి వెళ్తుండగా.. రాయచోటి వైపు నుంచి పీలేరు వైపు వెళ్తున్న కారు ఢీకొన్న సంఘటనలో గాయాలయ్యాయి. గాయపడ్డ వ్యక్తిని 108 సహాయంతో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

టీడీపీ, జనసేన నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరికలు


ఎంపీ, ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్న కొండూరు ప్రతాప్‌రాజు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు, ఓబులవారిపల్లి మండలాల నుంచి భారీ ఎత్తున టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎంపీ మిథున్‌రెడ్డి, ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు సమక్షంలో 60 కుటుంబాలు, 150 మందికిపైగా పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. తెలుగుదేశం పార్టీ మాజీ శాప్ డైరెక్టర్ కొండూరు ప్రతాప్ రాజు ఆధ్వర్యంలో సుమారు 20 కుటుంబాలు చేరాయి. అలాగే అనంతరాజుపేట పంచాయతీలో పలువురు వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరంతా బైక్ ర్యాలీగా స్థానిక పార్టీ కార్యాలయం వరకు వచ్చి ఎంపీ, ఎమ్మెల్యేలను కలిశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు, ఆయన పరిపాలన నచ్చి పేద ప్రజలకు మేలు చేయాలనే ఉద్దేశంతో వైఎస్సార్‌సీపీలో చేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి, వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్ ముప్పాల హేమనవర్మ, మార్కెట్ చైర్మన్ సుబ్బరామరాజు, టూరిజం డైరెక్టర్ సుధాకర్, జెడ్పీటీసీ రత్నమ్మ, సర్పంచ్ శివయ్య, ఉపసర్పంచ్ శివసాయి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అజయ్‌రెడ్డికి శుభాకాంక్షలు

స్థానిక పార్టీ కార్యాలయంలో రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డికి ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

గాంధీజీ కలలు నెరవేర్చిన జగన్

పుల్లంపేట : జాతిపిత మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేసి, ప్రతి 50 కుటుంబాలకు ఒక వలంటీర్‌ను నియమించి, ప్రజల సమస్యలను స్థానికంగానే పరిష్కరించేలా చేశారని పేర్కొన్నారు. గురువారం అనంతయ్యగారిపల్లిలో గ్రామ సచివాలయాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం జగనన్న ప్రజల కోసం నవరత్నాలు ప్రవేశపెట్టారని తెలియజేశారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందుతున్నాయా లేదా అని తెలుసుకునేందుకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి, ఎంపీపీ ముద్దా బాబుల్‌రెడి, మల్లికార్జునరెడ్డి, కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ర్యాష్ డ్రైవింగ్ కేసులో జైలు

రాయచోటి టౌన్ : ర్యాష్ డ్రైవింగ్ కేసులో షేక్ జబీవుల్లా అనే నిందితుడికి మూడు రోజులు జైలు శిక్ష ఖరారు చేస్తూ రాయచోటి కోర్టు ఏజెఎఫ్‌సీఎం న్యాయమూర్తి శారద గురువారం తీర్పు చెప్పారు. ట్రాఫిక్ ఎస్ఐ మహమ్మద్ రఫీ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాయచోటి పట్టణంలో స్కూటర్‌ను అతి వేగంగా నడపడంతోపాటు ర్యాష్‌గా నడిపినందుకు నిందితుడిపై పోలీసలు కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపెట్టారు. న్యాయమూర్తి శారద నిందితుడికి జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

బతుకుదెరువు కోసం వెళ్లి తిరిగిరాని లోకాలకు

– కువైట్‌లో మండల వాసి మృతి

రామాపురం : బతుకుదెరువు కోసం గల్ఫ్ దేశానికి వెళ్లిన ఓ వ్యక్తి తిరిగిరాని లోకాలకు వెళ్లాడు. దీంతో బాధిత కుటుంబం దుఃఖసాగరంలో మునిగిపోయింది. వివరాలు ఇలా ఉన్నాయి. రామాపురం మండలం కసిరెడ్డిగారిపల్లెకు చెందిన అరిగెల రమణయ్య(49) కుటుంబ పోషణ కోసం కువైట్ వెళ్లాడు. కుటుంబ సభ్యులను చూసేందుకు గతంలో మూడు సార్లు ఇంటికి వచ్చి తిరిగి వెళ్లాడు. అక్కడ పని చేస్తూ వచ్చిన డబ్బులు కుటుంబానికి పంపించే వాడు. ఈ క్రమంలో నెల క్రితం మళ్లీ వెళ్లాడు. మృతుడికి భార్య సుభద్ర, ఇద్దరు కుమారులు ఉన్నారు. అక్కడ కూలీ పనులు చేసుకుంటూ ఉండగా బుధవారం బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందినట్లు బంధువుల ద్వారా మృతుడి భార్యకు, కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా తెలియజేశారు. పెద్ద దిక్కు మృతి చెందడంతో కుటుంబం కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. ప్రభుత్వం ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.


రమణయ్య(ఫైల్)

పౌరసరఫరాల గోదాము తనిఖీ

లక్కిరెడ్డిపల్లె : లక్కిరెడ్డిపల్లెలోని పౌర సరఫరాల గోదామును జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శివరామమూర్తి, జిల్లా అధికారి రఘురాం, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్‌లు గోదామును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చౌక దుకాణాల ద్వారా పంపిణీ చేయు నిత్యావసర వస్తువులను పరిశీలించడం జరిగిందన్నారు. నాణ్యమైన సరుకులను చౌక దుకాణాలకు పంపిణీ చేయాలని గోదాము ఇన్‌చార్జి మల్లికార్జునబాబుకు ఆదేశించారు. అనంతరం గోదాము దస్త్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పౌరసరఫరాల సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.


గోదామును పరిశీలిస్తున్న అధికారులు


ద్విచక్రవాహనం కాల్చివేత

బి.కొత్తకోట : ఇంటి వద్ద నిలిపి ఉంచిన ద్విచక్రవాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు కాల్చివేసిన సంఘటన బుధవారం తెల్లవారుజామున బి.కొత్తకోట బైపాస్‌రోడ్‌లో జరిగింది. బైపాస్‌రోడ్డుకు చెందిన విష్ణువర్ధన్ తన స్కూటీని ఇంటి బయట నిలిపి ఉంచాడు. గుర్తుతెలియని వ్యక్తులు తెల్లవారుజామున మూడున్నర గంటల సమయంలో దగ్ధం చేసి.. అనంతరం ఇంటి తలుపు ముందర గోనెసంచులు, రబ్బర్లు వేసి మంటలు పెట్టి పరారయ్యారు. శబ్దాలు రావడంతో భయాందోళనకు గురైన విష్ణువర్ధన్, కుటుంబ సభ్యులు బయటకు వచ్చి మంటలను అదుపుచేసేందుకు ప్రయత్నించారు. తమకు ఎవరితోనూ విభేదాలు లేవని, ఇలా ఎవరు చేశారో విచారణ చేయాలని విష్ణువర్ధన్ పోలీసుల దృష్టికి తెచ్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.



బైక్‌లు ఢీకొని వ్యక్తి మృతి

పీలేరురూరల్ : రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం పీలేరు పట్టణ శివారు ప్రాంతంలో చోటు చేసుకుంది. వివరాలిలా వున్నాయి. పీలేరు మండలం యర్రగుంట్లపల్లె పంచాయతీ మారెంరెడ్డిగారిపల్లెకు చెందిన ఓ.చంద్రారెడ్డి (68) తన ద్విచక్రవాహనంలో పీలేరుకు బయలుదేరాడు. నందలూరు మండలం నాగిరెడ్డిగారిపల్లెకు చెందిన ఎం.ఆదికేశవులు, ఎం.పృథ్వీ అగ్రహారం ఎల్లంపల్లెకు బంధువుల ఇంటికి వచ్చారు. అక్కడి నుంచి ద్విచక్రవాహనంలో పీలేరుకు వస్తూ ఆటో నగర్ వద్ద ముందు వెళుతున్న చంద్రరెడ్డి ద్విచక్రవాహనాన్ని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ చంద్రారెడ్డిని చికిత్స నిమిత్తం వేలూరు సీఎంసీకి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమణ తెలిపారు.


మృతి చెందిన చంద్రారెడ్డి

కర్ణాటక మద్యం స్వాధీనం

మదనపల్లె : కర్ణాటక నుంచి కారులో అక్రమంగా మద్యం తరలిస్తుండగా మదనపల్లె ఎస్ఈబీ డీటీఎఫ్ విభాగం పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. గురువారం ఉదయం కర్ణాటక నుంచి కారు చెంబకూరు మార్గంలో మదనపల్లెకు వస్తుండగా.. సమాచారం అందుకున్న డీటీఎఫ్ ఎస్ఐ బాబు సిబ్బందితో వెళ్లి రామసముద్రం వద్ద అడ్డగించారు. డ్రైవర్ కారును నిలపకుండా ముందుకు వెళ్లనీయడంతో పోలీసులు ఛేజ్ చేశారు. దీంతో అక్రమ మద్యం రవాణాదారులు మదనపల్లె మండలంలోకి ప్రవేశించగానే కారును, మద్యం కేసులను వదిలి పరారయ్యారు. ఎస్ఐ కారులో పరిశీలించి.. రూ.3 లక్షల విలువ చేసే 13 కేసుల కర్ణాటక టిన్‌బీర్లు, టెట్రాప్యాకెట్ల బ్రాందీని పట్టుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఈబీ ఏఈఎస్ ఎం.రాధాకృష్ణ తెలిపారు.


కారు, మద్యంతో ఎస్ఈబీ డీటీఎఫ్ పోలీసులు

సీసీలు, సంఘమిత్రల చేతివాటం

స్త్రీనిధి రుణాల మంజూరు, రికవరీల్లో నిధుల గోల్‌మాల్

పెద్దతిప్పసముద్రం : కుటుంబంలో ఆర్థిక అవసరాల కోసం ప్రైవేటు వ్యక్తుల వద్ద అధిక వడ్డీలకు డబ్బులు తెచ్చుకునే కన్నా.. మహిళా సంఘంలో సభ్యురాలిగా ఉంటే తక్కువ వడ్డీకే ప్రభుత్వం ద్వారా నగదు పొందవచ్చని వారంతా భావించారు. బ్యాంకుల ద్వారా స్త్రీ నిధి రుణాలు కూడా పొంది ప్రతి నెలా కంతుల వారీగా సొమ్ము బ్యాంకులో జమ చేయాలని మహిళా సంఘాల సభ్యులు ఎంతో నమ్మకంతో సంఘమిత్రల చేతికి ఇస్తూ వచ్చారు. అయితే సంఘమిత్రలకు సీసీలు కూడా తోడు కావడంతో బ్యాంకుకు జమ కావాల్సిన స్త్రీనిధి సొమ్ము పక్కదారి పట్టింది. నమ్మకంగా ఉండాల్సిన సీసీ, సంఘమిత్రలే సభ్యుల సొమ్మును దిగమింగేశారు. తీసుకున్న రుణం వడ్డీతో సహా ఏడాది క్రితమే చెల్లించినా.. కొత్తగా బ్యాంకు నుంచి ఎలాంటి రుణం మంజూరు కాకపోవడంతోపాటు ఇంకా రూ.వేలల్లో అప్పు ఉన్నట్లు ఆన్‌లైన్ రికార్డులు చెబుతున్నాయి. దీంతో బాధిత మహిళా సంఘాల సభ్యులు న్యాయం కోసం అధికారులు, పోలీస్ స్టేషన్ చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన దుస్థితి నెలకొందని బాధిత మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదాహరణకు మండలంలోని పట్టెంవాండ్లపల్లి, కమ్మచెరువు, కందుకూరు, తుమ్మరకుంట, పులికల్లు పంచాయతీల్లోని మండల సమాఖ్య పరిధిలోని పలు సంఘాల సభ్యులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. గతంలో సీసీలు చేతివాటంతోపాటు సంఘమిత్రలు సైతం అందినకాడికి సభ్యుల సొమ్ము దోచుకుని తమను నిలువునా ముంచేశారని మహిళలు వాపోతున్నారు. ఇటీవల కాలంలో స్త్రీనిధి, కమ్యూనిటి ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ (సీఐఎఫ్) సొమ్ము మాయాజాలం వ్యవహారంపై నాలుగు ప్రత్యేక బృందాల సభ్యులు కలసి.. కేవలం నాలుగు గ్రామ సమాఖ్యల పరిధిలో ఉన్న మహిళా సంఘాల గ్రూపు రికార్డులను పరిశీలించి ఆడిట్ నిర్వహించారు. రూ.20.31 లక్షల సొమ్ము స్వాహా అయినట్లు బట్టబయలైంది. ఈ సొమ్ము రికవరీ విషయంలో జిల్లా డీఆర్‌డీఏ అధికారులు సైతం సంఘమిత్రలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కందుకూరు మినహా మిగిలిన నాలుగు పంచాయతీల్లో స్త్రీ నిధికి సంబంధించి ఇంకా రూ.28 లక్షల నిధులు రికవరీకి నోచుకోలేదని వైఎస్సార్ క్రాంతి పథం అధికారులు చెబుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు మండలంలోని అన్ని గ్రామ సమాఖ్య పరిధుల్లో సమగ్రంగా ఆడిట్ నిర్వహించి.. పక్కదారి పట్టిన సొమ్మును రికవరీ చేయించి కొత్తగా రుణాలు మంజూరు చేసి మహిళల ఆర్థిక అభివృద్ధికి పాటుపడాలని సంఘాల సభ్యులు విన్నవిస్తున్నారు.



వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయం

వారం రోజుల్లో ఆడిట్

తంబళ్లపల్లి మండలంలోని రెండు గ్రామ సమాఖ్యల్లో ఇలాంటి సమస్య ఉంటే ఆడిట్ నిర్వహిస్తున్నాం. అక్కడి ఆడిట్ ముగిసాకా అదే టీం సభ్యుల ద్వారా పెద్దతిప్పసముద్రం మండలంలోని మిగిలిన గ్రామ సమాఖ్యల్లో కూడా సమగ్రమైన ఆడిట్ నిర్వహిస్తాం. నిధులు దుర్వినియోగమైనట్లు ఆడిట్‌లో వెల్లడైతే బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయించి సొమ్ము రికవరీ చేస్తాం.

– సత్యనారాయణ, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్, అన్నమయ్య జిల్లా

